థీమ్ పార్క్‌లో 'వాకర్స్ స్వచ్ఛత'

మల్లాపూర్: మల్లాపూర్ కలర్స్ థీమ్ పార్కులో క్లీన్ పార్క్ పేరిట ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. పార్కులోని చెత్తను ప్లాస్టిక్ కాగితాలు, డబ్బాలను తొలగించారు. ప్రతి నెల రెండో ఆదివారం, నాలుగో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వాకర్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు పైళ్ల ప్రవీణ్, శ్రీనివాస్ దేవ్, బెల్లం గట్టయ్య, భూమండ్ల శ్రీశైలం, పల్లె కుమార్‌యాదవ్, వెంకటేశ్వర్లు, మధు, వీరారెడ్డి, ఎల్లయ్య, ప్రకాష్, లక్ష్మణ్, రాజు, గుప్తా, శేఖర్, శంకర్, మోహన్ యాదవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యాత పాటించాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మల్లాపూర్: సీసీరోడ్డు పనుల్లో నాణ్యాత ప్రమాణాలు పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ కేఎల్‌రెడ్డినగర్ కాలనీలో రూ.14 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కాలనీవాసులు యాకుబ్‌రెడ్డి, చందు సుల్తానా, శ్రీనివాస్, తిరుమల మిలీనియం వాసులు,శివగౌడ్, రాజేష్, మూర్త, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్ల తొలగింపు

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్ తదితర బస్తీలో గృహాలను తాకుకుంటూ ఉన్న విద్యుత్ వైర్లను ఆదివారం విద్యుత్ శాఖ అధికారులకు ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్‌పటేల్ ఆదివారం ఫిర్యాదు చేశారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లను బిగించి వాటిపై కేబుల్ తొడుగులను అమర్చారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ... ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

రాంచందర్‌రావుకు సత్కారం


ఎన్.రాంచందర్‌రావును సత్కరిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: నిజాంపేటలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఆయనను శాలువాతో సత్కరించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం


బేబీరాణి (ఫైల్)


మాణిక్‌సింగ్ (ఫైల్)

మల్కాజిగిరి: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ మీర్జాలగూడకు చెందిన గడ్డం బేబీరాణి(50) గృహిణి ఈనెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ సంఘటనపై ఆదివారం ఆమె భర్త శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఆమె కుడి చేతిపై శుభరేఖ పేరులో పచ్చబొట్టు ఉందని ఆచూకీ గుర్తించిన వారు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

మరో ప్రాంతాల్లో..

వీణాపాణినగర్‌కు చెందిన మాణిక్‌సింగ్(40) కూలి పని చేస్తాడు. గత నెల 25వ తేదీన పనికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ సంఘటన పై అతని తండ్రి దిలీప్‌సింగ్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాద దేశమైన పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడొద్దు

ఉప్పల్: ఇండియా పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుధారాణి ఆధ్వర్యంలో పాకిస్తాన్ జాతీయ జెండాను దహనం చేశారు. ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద ఆదివారం పాక్ దిష్టిబొమ్మతో పాటు ఆ దేశ జాతీయ జెండాను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉగ్రవాద దేశమైన పాకిస్తాన్‌తో ఇండియా మ్యాచ్ ఆడొద్దని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీకి, ఐసీసీ అధ్యక్షుడు జైషాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రూ 53.01 కోట్లతో విద్యా బడ్జెట్

పాఠశాలల వార్షిక ప్రణాళిక ఖరారు • ప్రభుత్వ విద్య బలోపేతం, వసతుల కల్పనకు చర్యలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతం చేసేందుకు అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఎంపిక చేసిన 176 సర్కారు బడుల్లో మనఊరు, బస్తీ, మన బడి కార్యక్రమం కింద రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అధ్వర్యంలో రూ.12.50 కోట్లతో 286 ప్రభుత్వ బడుల్లో మరమ్మతు పనులు పూర్తి చేశారు. మరో వైపు బడుల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. 2025–26 విద్యా సంవత్సరానికి రూ.53.01 కోట్లు జిల్లాకు అవసరమని ప్రతిపాదనలు పంపగా దీన్ని ఉన్నతాధికారులు ఆమోదించారు. ఈ నిధులతో జిల్లాలో విద్యా సమస్యలు తీరుతాయని అధికారులు భావిస్తున్నారు.

వసతుల కల్పనకు అధిక నిధులు..

ఈ బడ్జెట్లో అధికంగా పాఠశాలల్లో వసతుల కల్పనతోపాటు విద్యను పూర్తి స్థాయిలో అందించేందుకు అవసరమైన నిధులు కావాలని ప్రతిపాదించారు. జిల్లాలో మొత్తం 15 మండలాలు,16 పురపాలిక సంఘాల పరిధిలో పీఎస్‌లు 375, యూపీఎస్‌లు 22, ఉన్నత పాఠశాలలు 108 ఉండగా, ఇందులో 96,012 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యంగా తాగునీరు, డిజిటల్ తరగతులు, గ్రంథాలయాల నిర్వహణ వంటి విషయాలను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అధికారులు రూపొందించిన ప్రస్తుత వార్షిక ప్రణాళిక ప్రకారం జిల్లాకు వచ్చే నిధులు ఎంతో ప్రయోజనంగా ఉండగలదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

యూడైస్ ఆధారంగా నిధులు..

గతేడాది కన్నా ఈ సారి జిల్లాకు అధిక మొత్తంలో నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాకు మొత్తం రూ.53.01 కోట్ల నిధులు అవసరమని గుర్తించిన అధికారులు, అందులో అధిక శాతం విద్య మౌలిక వసతుల కల్పనకు కేటాయించారు. హెచ్ఎంలు ఆయా పాఠశాలలకు సంబంధించిన వివరాలు యూడైస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు చేసిన దాని ఆధారంగా ఈ నిధులు రానున్నాయి. అత్యధికంగా బాలికా విద్యా నిర్వహణ, విద్యార్థులకు ఆహారం, ఉపాధ్యాయులు వేతనాల కోసం అవసరమని ప్రతిపాదించారు. డిజిటల్ విద్య, విద్యార్థులకు అందించే రెండు జతల దుస్తుల కుట్టు కూలీ, ఉపాధ్యాయులకు శిక్షణ, గ్రంథాలయాల ఏర్పాటుకు కూడా నిధులు అందనున్నాయి.

తెలంగాణను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం



ఉప్పల్: ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ డిజేబిలిటీ టీ–20 చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ క్రీడలపై ఎంతో ప్రేమ కలిగిన నాయకుడని అన్నారు. రాష్ట్రంలోని ముఖ్య పట్టణాల్లో ఉప్పల్ తరహా అంతర్జాతీయ స్థాయి స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా క్రీడలపై అపారమైన మక్కువ కలిగిందన్నారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. వచ్చే ఒలింపిక్స్ నాటికి తెలంగాణను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. తాను క్రికెట్ అభిమానినేనని నిజామబాద్ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఉందని గుర్తు చేసుకున్నారు. పిల్లలకు క్రీడలపై ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

రోడ్డెక్కిన బస్తీవాసులు

కుషాయిగూడ: మురుగు సమస్యను పరిష్కారం చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం చర్లపల్లి డివిజన్ కృష్ణారెడ్డినగర్ కాలనీవాసులు రోడ్డెక్కారు. కాలనీలో పొంగుతున్న డ్రైనేజీ సమస్యను ఉదయం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వయంగ పరిశీలించి జలమండలి అధికారులతో మాట్లాడి మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. బతుకమ్మ ఆడుకునేందుకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని వెంటనే మురుగు క్లియర్ చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కాలనీకి చేరుకున్న జలమండలి సిబ్బంది సమస్యను అక్కడి నుండి వెళ్లిపోయారని తెలిపారు. దీంతో అధికారుల తీరును నిరసిస్తూ రోడ్డెక్కి ధర్నాకు దిగారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సేవా పక్షం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాచారం వేంకటేశ్వర భక్త సమాజం ఆవరణలో రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు, నేతలు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవినాయక్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, మల్కా ప్రకాష్, అనితారెడ్డి, దయానంద్‌గౌడ్, సీనియర్ సీటిజన్స్ సాయిబాబా, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తీరొక్క పూవై.. గౌరమ్మ కొలువై!

ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు షురూ • ఆటపాటలతో మహిళల సందడి

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభమయ్యాయి. మహిళల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మను పేర్చి తయారు చేశారు. సాయంత్రం బతుకమ్మ వద్ద గౌరమ్మ పెట్టి పూజలు చేశారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆడారు. బతుకమ్మ ఆటపాటలతో కాలనీలు, బస్తీల్లో సందడి వాతావరణం నెలకొంది. అదే విధంగా పలు పాఠశాలల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ప్రతిభ కబబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. – ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం


ఓల్డ్‌సఫిల్‌గూడ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు


నాచారంలో బతుకమ్మతో కార్పొరేటర్ చింతల శాంతి


డిఫెన్స్‌కాలనీ నార్త్ పార్కులో..


శాంతినగర్‌లో రాక్‌హుడ్ స్కూల్‌లో..


నాచారంలో బతుకమ్మలతో నాచారం కార్పొరేటర్ శాంతి


కాప్రా విజయ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

దేవీ శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబు


దేవి శరన్నవరాత్రులకు ముస్తాబైన త్రిశక్తి అమ్మవారి ఆలయం

రామంతాపూర్: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు రామంతాపూర్ పరిధిలోని గోకులేనగర్‌లోని శ్రీ మహాకాళి దేవాలయం, ఊరపోచమ్మ దేవాలయం, వెంకటరెడ్డినగర్‌లోని శ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ ఆలయం, నెహ్రూనగర్‌లోని బద్ది పోచమ్మ ఆలయం, ప్రధాన రహదారిలోని కట్ట మైసమ్మ ఆలయాలు ముస్తాబు అయ్యాయి. ఈనెల 23 నుంచి అమ్మవారు రోజుకోక అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ప్రసిద్ధి చెందిన శ్రీ మహంకాళీ ఆలయంలో పుష్పగిరి పీఠాధిపతి శ్రీవిద్యాశంకర భారతిస్వామి, మంగళ స్నానములతో శరన్నవరాత్రులు వైభవంగా జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధ్యక్షుడు సుర్వీ భీష్మాగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొండ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు గౌరీభట్ల దయానంద్ శర్మ తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం


బోడుప్పల్ చౌరస్తాలో జ్ఞానమాల వేసి నివాళులర్పిస్తున్న నత్తి మైసయ్య

బోడుప్పల్: అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళదామని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. బోడుప్పల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన 344వ జ్ఞాన మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అంబేడ్కర్ కలలు కన్నారని ఆకలలను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, గరుకుల యాకయ్య, బండారి సాయి, చిల్ల అంజయ్య, జడ శ్రీనివాస్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

హిందుత్వంపై జరిగే దాడులను ఎదుర్కోవాలి


అల్వాల్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

అల్వాల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు, విజయదశమి ఉత్సవం ఆదవారం అల్వాల్ మంగాపురంలోని బతుకమ్మ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌సీసీ పైపుల ఫ్యాక్టరీ యజమాని వెంకన్నగారి వెంకట్‌రెడ్డి, సికింద్రాబాద్ జిల్లా ధర్మజాగరణ ప్రముఖ్ రుద్రరాజు సుబ్బరాజు హాజరై మాట్లాడారు. సమాజంలో హిందుత్వంపై జరిగే దాడులను గమనిస్తూ వాటిని ఎదుర్కొనే విధంగా సమాజం తయారు కావాలన్నారు. 1925 సంవత్సరంలో భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను రక్షించడమే ఆశయంగా డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారని అన్నారు. ఎన్నో లక్షల మంది స్వయం సేవకులను తయారు చేస్తూ ఎలాంటి అంతర్గత కలహాలకు తావు లేకుండా కొనసాగుతోందని అన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన


బుద్ధానగర్‌లో చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్, మాజీ మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని 11వ వార్డు బుద్ధానగర్‌లో ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా ఐదురోజులు తడి చెత్త, రెండు రోజుల పొడిచెత్తను సేకరించనున్నట్లు కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ సత్ఫలితాలను సాధిస్తే ఈ విధానాన్ని నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో 5+2 విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ మద్ది యుగేందర్‌రెడ్డి, భీంరెడ్డి నవీన్‌రెడ్డితో కలిసి ఆదివారం కమిషనర్ ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 5 రోజులు తడిచెత్త, 2 రోజులు పొడి చెత్త సేకరణతో చెత్తను వేరుచేయు విధానం, చెత్త సేకరణ సులభతరం అవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు చక్కని మార్గమని పేర్కొన్నారు. ప్రజలు భాగస్వామ్యంతో విజయవంతం చేసే విధంగా ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం అవగాహన కోసం కరపత్రాలు, స్టిక్కర్లు, తడి, పొడిచెత్త కోసం చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ప్రతినిదులు ఉమాకాంత్, సుధ, డీఈ సాయినాథ్‌గౌడ్, ఏఈ వినీల్‌కుమార్ గౌడ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఈఈ బాల మురళీకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామం.. బతుకమ్మ రాగం.!




ఉప్పల్ మిని శిల్పారామంలో బతుకమ్మ వేడుకలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ఆదివారం సాయంత్రం కనులపండువగా జరిగింది. అక్కడి సిబ్బందితో పాటు, స్థానికులు, అక్కడి వచ్చిన వారు సైతం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. యాంపీ థియేటర్‌లో నల్గొడ జిల్లా నుంచి వచ్చిన నాట్య గురువు కళ్యాణి శేఖర్ సర్వసుద్ధి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అరలించింది. పుష్పాంజలి, శ్రీవిఘ్న రాజాం భజే, శ్రీమాన్ నారాయణ, విఘ్నేశ్వర ప్రార్థన, అయిగిరి నందిని దేవి స్తుతి తదితర అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

చీకట్లోనే బతుకమ్మ వేడుకలు

- నెల రోజులుగా వెలగని వీధి దీపాలు
- సాయిరాంనగర్‌లో మహిళలు ఆగ్రహం

కాప్రా: మన బతుకుల్లో వెలుగులు నింపాలని ఎన్నో ఆశలతో మహిళలు బతుకమ్మ పండుగకు సిద్ధమైతే అధికారుల నిర్లక్ష్యం వల్ల వీధి దీపాలు వెలగలేదు. కాప్రా సాయిరాంనగర్‌లో నెల రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. కనీసం బతుకమ్మ పండగకైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగిస్తారని ఆశతో ఎదురుచూసినా వారికి నిరాశే ఎదురైంది. దీంతో చీకట్లోనే బతుకమ్మ ఉత్సవాలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో నెల రోజులకుపైగా దాదాపు 20 వీధి దీపాలు వెలగడంలేదని, ఎన్నోసార్లు సంబంధిత సిబ్బందికి, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వీధి దీపాలు వెలిగించి బతుకమ్మ ఉత్సవాలను వెలుగుల్లో జరుపుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కాప్రా సాయిరాంనగర్‌లో చీకట్లోనే బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225470 | 9912220571